క్లుప్తంగా

104 ఉద్యోగులకు న్యాయం చేయాలి



మామిడికుదురులో సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు జగ్జీవన్‌రావు

మామిడికుదురు: తమ సమస్యలు పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ 104 ఉద్యోగులు శనివారం మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. 104 వ్యవస్థను పీహెచ్‌సీల ద్వారానే నిర్వహించాలని, జీఓ నంబర్–7 వర్తింప చేయాలని, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఇంత వరకు యాజమాన్యం నుంచి రావల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇంక్రిమెంట్లు అందరికీ అందజేయాలని 104 యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, డ్రైవర్ ఎం.జగ్జీవన్‌రావు కోరారు.

అంబాజీపేట: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి తమను ఆదుకోవాలని కోరుతూ 104 సిబ్బంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, స్థానిక సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారికి సిబ్బంది శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 104 యూనియన్ ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు, బి.పూర్ణవి, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రలింగ రథయాత్రకు స్వాగతం



రథంలో శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: సోమనాథేశ్వర వజ్రలింగ దర్శనం దివ్య రథయాత్రకు శనివారం మామిడికుదురులో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. రథంలో ఏర్పాటు చేసిన శివలింగాన్ని స్థానికులు దర్శించుకున్నారు. విశ్వశాంతి, లోక కల్యాణం, ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించడం కోసం ఈ రథయాత్ర చేపట్టినట్టు రాజయోగ గురువు బీకే చంద్రశేఖర్ తెలిపారు. 2018లో అనంతపురం జిల్లా హిందూపురంలో రథయాత్ర చేపట్టామన్నారు. ఆరు వేల గ్రామాలు వెయ్యి పాఠశాలలు, కళాశాలలు సందర్శించేలా ఈ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మణి, కార్తీక్, ప్రముఖ యోగా గురువు ఖేతన్ ఆకుల పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

సఖినేటిపల్లి: గ్రామంలోని గాంధీనగర్ కాలనీలో శనివారం స్థానిక సజీవుని ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి అఖిరా కంటి ఆసుపత్రి అనుబంధ సంస్థ పరమహంస యోగానంద నేత్రాలయం వైద్య సిబ్బంది ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ ప్రముఖుడు రేపూరి ఏసు నరసింహ రాజా ప్రారంభించారు. శిబిరంలో 80 మంది రోగులకు కంటి వైద్య సిబ్బంది పరీక్షలు చేయగా, 20 మంది రోగులను ఆపరేషన్ల కోసం సిఫారసు చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గుమ్మిలేరులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం క్రింద మంజూరైన రూ 2.47 కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. శనివారం ఆయన గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, నవాబుపేట గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. వచ్చే ఏడాది జనవరిలో రెండో విడత నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఏపీఓ జి.అరుణకుమారి, మండల ఇంజనీరింగ్ జేఈ డి.వీరభద్రరావు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కె.భీమారావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి కె.బొజ్జిరాజు మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి శ్రీవాణి బెహరా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో శనివారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి, ఆరేళ్ల చిన్నారితో పాటు మరొక వ్యక్తిని గాయపరచింది. మెయిన్‌రోడ్డులో ఇంటి వద్ద ఉన్న బాలికపై దాడి చేసి కరచింది. తర్వాత వెంకట్రావు అనే వ్యక్తిపై దాడి చేసింది. వీరిరువురిని పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు.

నదీ కోత.. రైతు వ్యథ





అయినవిల్లి మండలం పొట్టిలంకలో కోతకు గురైన పాము కృష్ణమూర్తికి చెందిన భూమి, కోతతో నదిలో కలిసిన కొబ్బరి చెట్లు

- నదీ గర్భంలో కలసిపోతున్న లంక భూములు
- వందలాది ఎకరాలు కనుమరుగు
- గ్రోయిన్లతోనే లంక భూముల రక్షణ
- పట్టించుకోని ప్రభుత్వం

అయినవిల్లి: వరదల సమయంలో నదీకోతతో లంకభూములు కనుమరుగువుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా వందలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోయాయని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 42 కిలోమీటర్ల నుంచి 55 కిలోమీటర్ల వరకూ లంక భూములు గోదావరి నదీతీర ప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. ఈ లంక భూములు నదీ కోతకు గురవుతున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. లంక రైతులు తమ తాతల నాటి నుంచి ఈ భూముల్లోనే వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే నదీకోతతో ఏటా లంకభూములు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో పది ఎకరాలు భూమి ఉన్న రైతు నేడు అర ఎకరం మాత్రమే మిగిలింది. ఇటు ఉన్న భూమిని వదులుకోలేక నదీ గర్భంలో కలిసిన భూమి కోసం గుండె పగిలేలా అక్రందన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, శానపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక రైతులు తమ గోడును వెళ్ల బుచ్చుకుంటున్నారు.

పాలకులు పట్టించుకోకపోవడంతో..

దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో అప్పటి ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి ప్రతిపాదనలతో మండలంలోని నదీ పరివాహక ప్రాంతాల్లో లంకభూములు రక్షణ కోసం వేలకోట్ల రూపాయిల ఖర్చుపెట్టి గ్రోయన్లు నిర్మించారు. దీంతో నదీ కోత కొంతమేర ఆగింది. ఆ తరువాత వచ్చిన పాలకులు నదీ కోత నివారణకు ఏ ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. దీంతో నదీకోతకు అడ్డు లేకుండా పోయింది. మళ్లీ తీర ప్రాంతాల్లో లంక భూములు నదీకోతకు గురవుతున్నాయి. దీంతో రైతులు తమ గోడు పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. ఉన్న కాస్త భూమి కూడా గోదావరికి అర్పించాల్సిందేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలోని మామిడికుదురు, అంబాజీపేట, పి.గన్నవరం మండలంలోని నదీ పరివాహక ప్రాంతాల్లోని లంకభూములకు ఇదే పరిస్థితి. భూములు నదీకోతకు గురికాకుండా గ్రోయిన్లు నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు కోరుతున్నారు.

భూమంతా నదీ గర్భంలోకి..



మా తండ్రి పాము బాపనయ్యకు నదీపాయ వెంబడి రెండు ఎకరాలు భూమి ఉంది. ఆయనకు మేము ఇద్దరం కుమారులం. అయితే భూమంతా నదీ కోతకు గురై కలిసిపోయింది. ఇప్పుడు ఎకరం భూమి మిగిలింది. అందులోనే ఇళ్లు కట్టుకుని మిగిలిన దాంట్లో వ్యవసాయం చేసుకుంటున్నాం. నదీ కోతకు గ్రోయిన్లు నిర్మించాలి.

– పాము కృష్ణరాజు, పొట్టిలంక, అయినవిల్లి మండలం

ఎకరం భూమి మిగిలింది



మా నాన్న పాము కృష్ణమూర్తికి పది ఎకరాల లంక భూమి ఉంది. నదీకోత గురై ఇప్పుడు ఎకరం భూమి మిగిలింది. మేము ఆరుగురం అన్నదమ్ములం. ఉన్న కాస్త భూమిలోనే వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాం. ప్రభుత్వ నదీ కోతకు చర్యలు చేపట్టాలి.

–పాము అశోక్‌కుమార్, పొట్టిలంక, అయినవిల్లి మండలం

అంతరిక్ష యానం.. ఉపగ్రహాల ప్రయోగం



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న శాస్త్రవేత్త శివప్రసాద్

అంబాజీపేట: అంతరిక్ష యానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఉపగ్రహాల వల్ల ఎన్నో విషయాలను తెలుసుకోగలుగుతున్నామని విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ తెలిపారు. స్థానిక హైస్కూలులో శనివారం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో శివప్రసాద్ విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివప్రసాద్‌తో తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చంద్రయాన్ 3 ప్రయోగం ఎలా జరిగింది, చంద్రునికి ఒక వైపు సూర్య కాంతి ఎందుకు ఉండదు, అంతరిక్ష యానం చేసిన సునీతా విలియమ్స్ పరిస్థితి ఏంటి, భవిష్యత్‌లో ఇస్రో ఏమేమి ప్రయోగాలు చేయబోతోంది తదితర ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివప్రసాద్‌ను పాఠశాల హెచ్‌ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టింకరింగ్ ల్యాబ్ ఇంచార్జి బెహరా సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు వి. సత్యనారాయణ, ఎం.సత్తిబాబు, ఎస్.అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అభినందనీయం

- ఎంపీపీ గంగాధరరావు
- బిళ్లకుర్రులో మెగా వైద్య శిబిరం



బిళ్లకుర్రులో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, సర్పంచ్ లక్ష్మీపతిరావు

కొత్తపేట: గ్రామీణ ప్రాంతానికి కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ వంటి ప్రధాన వైద్య విభాగాల స్పెషలిస్టులను తీసుకువచ్చి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. బిళ్లకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు ఆధ్వర్యంలో అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కొత్తపేట కళాసాహితి అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు ప్రారంభించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంగాధరరావు, సర్పంచ్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ వైద్య సంస్థకు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ డీ గురుకిరణ్, ఆర్థోపెడిక్ డాక్టర్ వజ్రదీపిక, జనరల్ మెడిసిన్ డాక్టర్ జోయ్‌సన్, డెంటిస్టు డాక్టర్ మల్లిక, ఆప్తమాలజీ తదితర విభాగాల వైద్యులు ఆయా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి షుగరు, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేశారు. సుమారు 200 మంది సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే

అంబాజీపేట: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో భూ సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు శనివారం డీటీ వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డులను సరి చేసి రైతుల సమస్యలను పరిష్కరించడమే రీ సర్వే లక్ష్యమన్నారు. రెవెన్యూ ఆర్ఎస్ఆర్ రిజిస్టర్‌లో ఆర్ఎస్ నంబర్‌కు బదులుగా రైతులకు ఎల్‌పీ నంబర్ కేటాయించారన్నారు. రైతులకు సంబంధిత దస్తావేజుల జిరాక్స్‌లను, రెండు పాస్‌పోర్టు ఫొటోలను సర్వే సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటు



పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యనారాయణకు నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: పాశర్లపూడి పీఏసీఎస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత యూవీవీ సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శ్లాఘించారు. పాశర్లపూడిలో శనివారం జరిగిన యూవీవీ సంస్మరణ సభలో ఆయనతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సత్యనారాయణ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. సత్యనారాయణ పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేశారని కీర్తించారు. గుండెపోటుతో అతను మరణించడం తమను తీవ్రంగా బాధించిందన్నారు. సత్యనారాయణ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. సభలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ జక్కంపూడి తాతాజీ, పార్టీ నేతలు తోరం భాస్కర్, కొనుకు నాగరాజు, నెల్లి దుర్గాప్రసాద్, పిల్లి శ్రీనివాస్, స్థానికులు కుసుమ శివకుమార్, రొక్కాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నదీకోత నివారణకు చర్యలు చేపట్టాలి

పి.గన్నవరం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నదీకోత నివారణకు చర్యలు చేపట్టాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయలకు ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లో విలువైన పంట భూములు కోతకు గురవుతున్నాయని వివరించారు. నదీప్రాత భూములకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వడం లేదని, ఈ నేపథ్యంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వరదల సమయాల్లో లంక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా అప్పనపల్లి, అయినవిల్లి గ్రామాల్లో కాజ్‌వేలు నిర్మించాలని కోరారు. పి.గన్నవరం మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కోసం గత ప్రభుత్వం వశిష్ట నదిపై రూ.49.5 కోట్లతో వంతెన మంజూరు చేసిందన్నారు. అయితే నిధులు విడుదల చేయలేదన్నారు. ఇంతవరకూ జరిగిన పనులకు విడుదల చేయాలని ఎమ్మెల్యే గిడ్డి అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లారు.

పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ



పల్లిపాలెం పాఠశాల హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందిస్తున్న శేషారావు

మలికిపురం: గూడపల్లి పల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం పలువురు దాతలు 16 సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. ఈ మేరకు వీటిని పాఠశాల హెచ్‌ఎం ఆచంట రామచంద్రరరావుకు అందజేశారు. ఇందులో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కొల్లు శేషారావు మూడు ఫ్యాన్లు, రామాంజనేయ సిమెంటు, జనరల్ స్టోర్స్ అధినేత రెండు ఫ్యాన్లు, యాజమాన్య కమిటీ మాజీ చైర్మన్, ఇతరులు ఒక్కొక్కటి చొప్పున స్పాన్సర్ చేశారు. సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకుల తరహాలో సహకార వ్యవస్థ

డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ రాధాకృష్ణ వెల్లడి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీఓ రాధాకృష్ణ

ఆలమూరు: వాణిజ్య బ్యాంకుల అందించే అన్ని రకాల సేవలను సహకార వ్యవస్థ ద్వారా అమలు చేస్తామని డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ (డీసీఓ) రాధాకృష్ణ తెలిపారు. ఆలమూరులోని బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సహకార వ్యవస్థ వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. సహకార ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందించే సేవలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవలను కూడా సహకార రంగం ద్వారా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా సహకార సంఘాలు తీసుకురావాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సహకార వ్యవస్థ పటిష్టం కోసం అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. రామదాసు కోఆపరేటివ్ సహకార వ్యవస్థ అధ్యాపకులు, సహకార వారోత్సవ జిల్లా ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ పర్సనల్ ఇన్‌చార్జ్ డి.రాంబాబు, డీసీసీబీ బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సహకార సంఘం సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. దేవదాయ – ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ 1,29,235, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.46,056 మొత్తం రూ.1,75,291 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

అన్నప్రసాదానికి భక్తుల విరాళాలు

శనైశ్వరాలయంలో అన్నప్రసాదం పథకానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ ఎండీ రూ.10,116, దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి సుబ్బారావు అనే భక్తుడు రూ.10,116 విరాళంగా సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

భీమలాపురం నుంచి అప్పనపల్లికి పాదయాత్ర

మామిడికుదురు: పశ్చిమ గోదావరి జిల్లా భీమలాపురం నుంచి సుమారు ఆరు వందల మంది భక్తులు అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి ఆలయం వరకు 42 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శనివారం రాత్రి మామిడికుదురు అభయాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ బృందానికి స్థానిక భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ నుంచి బయలు దేరిన ఈ బృందం ఆదివారం స్వామి దర్శనం చేసుకుంటుందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు



విజేతలతో పీడీ భువనేశ్వరి

కొత్తపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో కొత్తపేట మండలం గంటి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బండారు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం తాటిపాకలో జరిగిన బాక్సింగ్ సెలక్షన్స్‌లో కె.మనోజ్, ఎస్.పూర్ణచందు, ఎస్.మాధురి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు త్వరలో మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. అలాగే జి.హర్షిత, టి.మనోజ్, ఎస్.అక్షయ్ రజిత పతకాలు సాధించినట్టు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, పీడీ వి.భువనేశ్వరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యావరణ కాలుష్యంతో మత్స్య సంపదకు నష్టం



కోల్‌కతాలో జరిగిన ఫిష్ వర్కర్స్ సమావేశంలో పాల్గొన్న కోనసీమ జిల్లా మత్స్యకారులు

మామిడికుదురు: పర్యావరణ కాలుష్యంతో మత్స్య సంపదకు తీరని నష్టం కలుగుతుందని, దాని వల్ల తమ జీవనం దెబ్బతింటుందని కోల్‌కతాలో శనివారం జరిగిన జాతీయ స్థాయి ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ స్కేల్ ఫిష్ వర్కర్స్ జాతీయ సదస్సులో కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకు దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన మత్స్యకార ప్రతినిధులు హాజరై తమ సమస్యలను ప్రస్తావించారు. కోనసీమ జిల్లా నుంచి జనరల్ సెక్రటరీ డి.పాల్, అధ్యక్షుడు డి.ఆదినారాయణ, కార్యదర్శి చింతా శ్రీనివాస్ హాజరై గంగపుత్రుల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. వైనతేయ గోదావరి నదిలో చేపట్టిన రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో పాటు సీఆర్‌జెడ్ పరిధిలో విచ్చలవిడిగా చేపట్టిన రొయ్యల సాగుతో పాటు సముద్రంలో వేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పర్యావరణ హానికరమైన వస్తువుల వల్ల మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించి, తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో వివరించామని గోగన్నమఠం గ్రామానికి చెందిన కార్యదర్శి చింతా శ్రీనివాస్ తెలిపారు. సదస్సులో వి.కొండబాబు, మల్లాడి వీరపండు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో లక్ష్య సాధన



డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



మామిడికుదురు గ్రంథాలయంలో ప్రముఖులకు నివాళి

రాజోలు: పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు లక్ష్యాన్ని సాధించవచ్చునని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలో ఉన్న గ్రంథాలయలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కళాశాల గ్రంథాలయ అధికారి కె.జగదీష్ రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, శైలజ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పాత్ర అద్వితీయం

మామిడికుదురు: గ్రంథాలయ ఉద్యమ్యంలో ఎంతో మంది ప్రముఖులు పాలు పంచుకున్నారని మామిడికుదురు గ్రంథాలయం అధికారి ఎ.సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ యస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈదరాడ బీడీఎస్ యెరుబండి కన్నబాబు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల త్యాగఫలమే గ్రంథాలయాలు

అంబాజీపేట: గ్రంథాలయ ఉద్యమ కారులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్, పోతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితరుల త్యాగం వల్లే గ్రంథాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్థానశాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ కారుల చిత్రపటం వద్ద శనివారం నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థులకు చిత్రలేఖన నిర్వహించారు.

చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. మూడో రోజు తొలుత గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. చిత్రలేఖన పోటీల్లో 53 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి తెలిపారు. పోటీలను తెలుగు టీచర్ చింతా శ్యాంబాబు పర్యవేక్షించారు. విజేతలలో జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని వెంకటలక్ష్మి అన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయవాది నరేష్ తదితరులు

అయినవిల్లి: మహిళలు న్యాయ విజ్ఞానంపై అవగాహన ఉండాలని, మహిళలు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉండాలని అప్పుడే దేశ ప్రగతి ముందుకు సాగుతోందని జిల్లా న్యాయమూర్తి డి. నరేష్, అమలాపురం ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి వి.గౌరీ శంకరరావు అన్నారు. శనివారం తొత్తరమూడి మహిళ సంఘ భవనంలో జాతీయ మహిళా కమిషన్, సేవాధికార సంస్థవారి ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ పేరిట మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత న్యాయవాదులు డి. నరేష్, వి.గౌరీశంకరరావు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ చట్టాలపై అందరికీ అవగహన ఉండాలన్నారు. అనంతరం స్థానిక ఎస్సై మనోహర జోషి న్యాయవాదులు డి. నరేష్, వి.గౌరీశంకరరావులను పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎస్సై మనోహర జోషి, న్యాయవాదులు వీకేఎస్ భాస్కర శర్మ, కేవీవీ శ్రీనివాసరావు, లీగల్ సెల్ వలంటీర్లు పాల్గొన్నారు.